క్లుప్తంగా

వేగంగా శ్రీవారి ఆలయ నిర్మాణ పనులు


నిర్మాణంలో ఉన్న వేంకటేశ్వర ఆలయం

నింద్ర: మండల కేంద్రమైన నింద్ర గ్రామంలో టీటీడీ ఆధ్వర్యంలో నిర్మించనున్న శ్రీ వేంకటేశ్వర ఆలయ నిర్మాణ పనులు వేగంగా జరుగుతున్నాయి. మంత్రి రోజా చొరవతో రూ.2.71 కోట్లతో ఆలయ పునర్నిర్మాణం చేపడుతున్నారు. గతంలో శిథిలావస్థలో ఉన్న ఆలయాన్ని మంత్రి రోజా టీటీడీ బోర్డు చైర్మన్‌తో మాట్లాడి నిర్మాణానికి నిధులు కేటాయించారు. దీంతో గ్రామంలో ఆలయ నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయి.

అన్నదానం


కేక్ కట్ చేస్తున్న అభిమానులు

వెదురుకుప్పం: మండలంలోని గంటావారిపల్లెలో ఎంపీపీ నాగరాణి భర్త, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి బండి హేమసుందర్ రెడ్డి జన్మదినం సందర్భంగా 200 మందికి అన్నదానం చేశారు. అంతకు ముందు హేమసుందర్‌రెడ్డి చిత్రపటాన్ని ఉంచి కేక్ కట్ చేసి (యూఎస్‌ఏలో ఉన్న అతనికి) శుభాకాంక్షలు తెలియజేశారు. కో–ఆప్షన్ సభ్యుడు వెంకటేష్, మండల పార్టీ ఉపాధ్యక్షుడు రామయ్య, యువత మండల అధ్యక్షుడు గణపతిరెడ్డి, సర్పంచ్ శేఖర్ రెడ్డి, పురంధర్‌రెడ్డి, మార్కొండ రెడ్డి, మాజీ సర్పంచ్ గోవిందన్, బొజ్జారెడ్డి, ఆనందరెడ్డి, రమణారెడ్డి, విజయశేఖర్‌రెడ్డి, యువత, మహిళలు ఉన్నారు.

లక్ష్మీ నరసింహా స్వామి ఆలయంలో పూజలు


ప్రత్యేక అలంకరణలో స్వామివారు

వెదురుకుప్పం: మండలంలోని చవటగుంటలో ఉన్న శ్రీ లక్ష్మీ నరసింహస్వామి ఆలయంలో శనివారం విశేష పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వేకువజామునే సుప్రభాత సేవతో స్వామివారిని మేల్కొలిపి ధూపదీప నైవేద్యాలు సమర్పించారు. అనంతరం భక్తి ప్రపత్తులతో ఆలయ ప్రధాన అర్చకులు స్వామివారికి పాలతో అభిషేకం చేశారు. అనంతరం స్వామివారిని సుంగధ పరిమళాలతో కూడిన వివిధ రకాల పుష్పాలు, తులసీ దళాలతో అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు.

విజయసింహారెడ్డికి డాక్టరేట్


విజయసింహారెడ్డికి డాక్టరేట్ ప్రదానం చేస్తున్న భారత్ యునివర్సిటీ ప్రతినిధులు

గంగాధర నెల్లూరు: ఉమ్మడి చిత్తూరు జిల్లా రెవెన్యూ అసోసియేషన్ ప్రెసిడెంట్ మాదిరెడ్డి విజయసింహారెడ్డికి బెంగళూరుకు చెందిన భారత్ యూనివర్సిటీ గౌరవ డాక్టరేట్ పట్టా అందజేసింది. వివిధ మండలాల్లో బడుగు, బలహీన వర్గాలకు అభ్యున్నతికి, అభివృద్ధికి తోడ్పడే విషయంలో విజయసింహారెడ్డి చేసిన సేవలకు గుర్తింపుగా డాక్టరేట్ అందుకున్నారు. మండలంలోని పాతపాలెం గ్రామానికి చెందిన విజయసింహారెడ్డి చిత్తూరు మండలం తహసీల్దారుగా, ఉమ్మడి చిత్తూరు జిల్లా రెవెన్యూ అసోసియేషన్ ప్రెసిడెంట్‌గా, ఏపీ జేఏసీ అధ్యక్షుడిగా వివిధ హోదాల్లో ఉద్యోగులకు అండగా నిలిచారు. ఈ సందర్భంగా విజయసింహారెడ్డిని పలువురు సన్మానించారు.

ముత్యపు పందిరిపై గోవిందుడు



తిరుపతి కల్చరల్: శ్రీగోవిందరాజ స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా మూడో రోజైన శనివారం రాత్రి స్వామివారు ముత్యపు పందిరి వాహనంపై కొలువై విహరిస్తూ భక్తులను కటాక్షించారు. రాత్రి 7 గంటలకు స్వామివారి వాహన సేవ ప్రారంభమైంది. వాహనం ముందు వృషభాలు, అశ్వాలు, గజరాజులు నడుస్తుండగా, కళాకారులు వివిధ దేవతామూర్తుల వేషధారణలో సందడి చేశారు. అలాగే భక్తబృందాలు స్వామివారిని కీర్తిస్తూ భజనలు, కళా ప్రదర్శనలు చేస్తూ భక్తి పారవశ్యాన్ని చాటాయి. ఉదయం 9.30 నుంచి 10.30 గంటల వరకు శ్రీదేవి, భూదేవి సమేత శ్రీగోవిందరాజ స్వామివారి ఉత్సవమూర్తులకు స్నపన తిరుమంజనం వేడుకగా నిర్వహించారు.

ఉజ్వల భవితకు ఐటీఐ

- విద్యార్థుల నైపుణ్యానికి పెద్దపీట
- కోర్సు పూర్తి కాగానే మెండుగా ఉపాధి అవకాశాలు
- స్వల్పకాలిక వ్యవధిలోనే స్థిరపడుతున్న విద్యార్థులు
- అడ్మిషన్లు జరుగుతున్నాయి.. సద్వినియోగం చేసుకోండి
- ప్రిన్సిపల్ గణేష్


ఎలక్ట్రానిక్ విద్యార్థులకు శిక్షణ ఇస్తున్న అధ్యాపకురాలు

కార్వేటినగరం: యువతలో నైపుణ్యాన్ని పెంపొందించి పరిశ్రమలకు అందిస్తున్నాయి. ఐటీఐలు కావాల్సినంత భరోసా ఇస్తూ బంగారు భవితకు బాటలు పరుస్తున్నాయి. ఐటీఐలలో చేరిన విద్యార్థులకు కమ్యూనికేషన్ స్కిల్స్, పర్సనాలిటీ డెవలప్‌మెంట్‌పై ప్రత్యేక శిక్షణ ఇస్తున్నారు. అవసరమైన మెళకువలపై పట్టు సాధిస్తుండడంతో కోర్సు పూర్తవగానే మెండుగా ఉపాధి అవకాశాలు లభిస్తున్నాయి. స్వల్పకాలిక వ్యవధిలోనే జీవితాల్లో స్థిరపడుతూ కుటుంబాలకు దన్నుగా నిలుస్తున్నారు.

ప్రముఖ కంపెనీల్లో ఉద్యోగాలు..

జిల్లాలోని పలు ఐటీఐలు సంప్రదాయ కోర్సులతో పాటు ఒక్కో కోర్సుకు ప్రాధాన్యత ఇస్తూ, ప్రత్యేకత చాటుకుంటుంది. కార్వేటినగరంలోని ప్రభుత్వ ఐటీఐలో ఎలక్ట్రీషియన్, డీజిల్ మెకానికల్, ఫిట్టర్, ఎలక్ట్రానిక్ మెకానిక్ వంటి కోర్సులు చేసిన విద్యార్థులు ప్రముఖ కంపెనీల్లో ఉద్యోగ అవకాశాలు పొంది స్థిరపడ్డారు.

కోర్సు మధ్యలోనే ఆన్ జాబ్ ట్రైనింగ్..

విద్యావిధానంలో వస్తున్న మార్పులకు అనుగుణంగా ఆన్ జాబ్ ట్రైనింగ్(ఓజేటీ) విధానాన్ని తీసుకొచ్చారు. విద్యార్థులు చదువుతుండగానే మధ్యలో ఓజేటీకి పంపుతున్నారు. హైదరాబాద్, చెన్నై, బెంగళూరు, వంటి ప్రముఖ నగరాల్లోని వివిధ సంస్థలో మూడు నెలలు, ఆరు నెలలు వ్యవధితో సంబంధిత అంశాల్లో నైపుణ్యం పెంపొందిస్తున్నారు. ఈ సమయంలో విద్యార్థులకు ఆయా సంస్థలు స్టైఫండ్‌గా కొంత మొత్తం చెల్లిస్తుండడం గమనార్హం. కోర్సు పూర్తయిన తర్వాత అవే సంస్థల్లో ఉద్యోగులుగా స్థిరపడాలనే సంకల్పంతో ఈ పద్ధతిని తీసుకొచ్చినట్లు తెలిసింది. 2023–24 విద్యా సంవత్సరంలో జిల్లా నుంచి 264 మంది ఓజేటీకి వెళ్లారు.


డీజిల్ మెకానిక్ కోర్సుపై విద్యార్థులకు శిక్షణ ఇస్తున్న అధ్యాపకులు

కోర్సులు ఇవే..

కోపా (ఏడాది కోర్సు), మ్యాన్ సివిల్ (రెండేళ్లు), ఎలక్ట్రీషియన్(రెండేళ్లు), ఎలక్ట్రానిక్స్ మెకానిక్(రెండేళ్లు, ఫిట్టర్(రెండేళ్లు), మెకానిక్ మోటార్ వెహికల్(రెండేళ్లు), మెకానికల్ డీజిల్ (ఏడాది,) టర్నర్(రెండేళ్లు), వైర్‌మెన్(రెండేళ్లు), వెల్డర్(ఏడాది), రిఫ్రిజిరేషన్, ఎయిర్ కండీషన్ టెక్నీషియన్(రెండేళ్లు), డ్రెస్‌మేకింగ్(ఏడాది), ప్లంబర్(ఏడాది), ఇన్‌స్ట్రుమెంట్ మెకానిక్(రెండేళ్లు), ఐసీటీఎస్‌ఎం(రెండేళ్లు) మెషినిస్ట్(రెండేళ్లు) ఉంటుంది.

మెళకువలు నేర్చుకున్నా..



ఎలక్ట్రీయన్ కోర్సు మొదటి సంవత్సరం చదువుతున్నా. నేను అమరరాజా కంపెనీలో ఓజేటీకి వెళ్లి నేను తీసుకున్న ఎలక్ట్రీషియన్ కోర్సులో కొన్ని మెళకువలు నేర్పించారు. కోర్సుతో పాటు నెలకు రూ.5 వేలు స్టైఫండ్ ఇచ్చారు.
–జ్ఞానేశ్వర్, ఎలక్ట్రీషియన్ విద్యార్థి, కార్వేటినగరం ఐటీఐ

రూ.10 వేలు స్టైఫండ్ ఇచ్చారు..



నేను ఎలక్ట్రానిక్ మెకానిక్ రెండో సంవత్సరం చదువుతున్నా. చెన్నైలోని సుందరం ఫాస్టర్స్ లిమిటెడ్ కంపెనీలో ఓజేటీకి వెళ్లా. కర్మాగారంలో స్పేర్‌పార్ట్సు తయారు చేయడం నేర్చుకున్నా. నెలకు రూ.10 వేలు స్టైఫండ్ ఇచ్చారు.
–ఆర్.జీ జగదీష్, ఐటీఐ విద్యార్థి, కార్వేటినగరం

డ్రస్ మేకింగ్ నేర్చుకున్నా..



కార్వేటినగరం ఐటీఐలో డ్రస్ మేకింగ్ నేర్చుకున్నా ఏడాదికి పూర్తిస్థాయిలో నేర్చుకున్నా. ఇప్పుడు ఇంటి వద్దనే నేర్చుకున్న డ్రెస్ మేకింగ్‌తో ఆర్థికంగా కుటుంబాన్ని పోషించుకుంటున్నా. ఐటీఐ కోర్సు వల్ల నా కుటుంబాన్ని పోషించుకునే ఆదాయాన్ని పొందుతున్నాను.
–దీక్షిత, ఐటీఐ విద్యార్థిని, కార్వేటినగరం

ఉజ్వల భవిత అందించాలనే సంకల్పం



ఐటీఐలో చేరిన విద్యార్థులకు ఉజ్వల భవిత అందించాలన్నదే మా ప్రధాన సంకల్పం. ట్రేడ్‌ల పాఠాలతో పాటు భావ వ్యక్తీకరణ, వ్యక్తిత్వ వికాస అంశాలపై ప్రత్యేక శిక్షణ ఇస్తున్నాం. చాలామంది మా విద్యార్థులు పెద్దపెద్ద కంపెనీల్లో ఉద్యోగాలు పొందడం సంతోషకరం. –పి.గణేష్, ఐటీఐ కళాశాల ప్రిన్సిపల్, కార్వేటినగరం

కల్యాణం.. కమనీయం


కన్నుల పండువగా శివపార్వతుల కల్యాణం


కల్యాణోత్సవంలో పాల్గొన్న మంత్రి రోజా

పుత్తూరు: పట్టణంలోని ప్రముఖ శ్రీకామాక్షీ సమేత శ్రీసదాశివేశ్వరస్వామి ఆలయంలో శివపార్వతుల కల్యాణం అత్యంత కమనీయంగా, వైభవోపేతంగా జరిగింది. వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం రాత్రి 7 గంటలకు మంత్రి ఆర్కే రోజా స్వామి, అమ్మవార్లకు పట్టువస్త్రాలను సమర్పించారు. అనంతరం వేద పండితులచే మంగళవాయిద్యాల మధ్య శాస్త్రోక్తంగా, కన్నుల పండువగా శివపార్వతులకు కల్యాణోత్సవం నిర్వహించారు. అంతకుముందు అర్చకులు మంత్రి రోజాకు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ఆలయంలో స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం మంత్రి రోజాను వేద పండితులు ఆశీర్వదించి, ఆలయ మర్యాదలు చేశారు. ఉదయం స్వామి, అమ్మవార్లకు పల్లకిసేవ నిర్వహించారు. కల్యాణోత్సవంలో పాల్గొన్న భక్తులకు ఆలయ నిర్వాహకులు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు.

జగనన్న మళ్లీ సీఎం కావాలని..

మహాశివుని ఆశీస్సులతో జగనన్న రెండోసారి ముఖ్యమంత్రిగా, తాను మూడవసారి ఎమ్మెల్యేగా ప్రమాణ స్వీకారం చేయాలని కోరుకొన్నట్లు మంత్రి రోజా తెలిపారు. ప్రజలంతా సంక్షేమ పథకాలతో అభివృద్ధి పథాన పయనించాలని కోరుకున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ రమేష్‌బాబు, మున్సిపల్ చైర్మన్ హరి, వైస్ చైర్మన్ శంకర్, కౌన్సిలర్లు నరసింహారావు, గుణ, ఆలయ కమిటీ సభ్యులు సుందరం, రమేష్, బాబు, రుక్మిణి, విజయలక్ష్మి, భరణి, సదాశివకోన, ఆరేటమ్మ ఆలయ కమిటీ చైర్మన్లు జయచంద్రన్, మనోహర్‌రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.


ఆలయ మర్యాదలు స్వీకరిస్తున్న మంత్రి రోజా

తిరుచ్చిపై శ్రీవారి కటాక్షం


తిరుచ్చి వాహనంపై విహరిస్తున్న శ్రీవారు

పుత్తూరు: అప్పలాయగుంటలో వెలసిన శ్రీప్రసన్న వేంకటేశ్వరస్వామి తిరుచ్చిపై విహరిస్తూ భక్తులను కటాక్షించారు. శనివారం వేకువజామున సుప్రభాత సేవతో శ్రీవారిని మేల్కొలిపి, నిత్య కైంకర్యాలు నిర్వహించారు. సాయంత్రం ఉభయ నాంచారుల సమేత ప్రసన్న వేంకటేశ్వరస్వామిని, పట్టు పీతాంబరాలు, విశేష స్వర్ణాభరణాలు, సుగంధ పరిమళభరిత పుష్పమాలికలతో సుందరంగా అలంకరించి ఊయల్లో కొలువుదీర్చారు. భక్తి కీర్తనల నడుమ శ్రీవారి ఊంజల్‌సేవ కనుల పండువగా జరిగింది. అనంతరం సర్వాలంకార భూషితుడైన శ్రీవారు ఉభయ దేవేరీలతో కలిసి తిరుచ్చి వాహనంపై కొలువుదీరారు. మేళతాలాలు, మంగళ వాయిద్యాల నడుమ మాడవీధుల్లో గ్రామోత్సవం వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా భక్తులు నారికేల, కర్పూర నీరాజనాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. భక్తులను కటాక్షించి ఆలయం చేరుకున్న స్వామి, అమ్మవార్లకు మంగళహారతులు ఇచ్చి పవళింపు సేవ నిర్వహించారు.

వాసవీదేవికి విశేష పూజలు


వడమాలపేటలో శాంతి హోమం నిర్వహిస్తున్న అర్చకులు

పుత్తూరు: వడమాలపేటలో వెలసిన శ్రీవాసవీదేవికి శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. వాసవీదేవి అమ్మవారి జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని ఆలయంలో అమ్మవారి మూలవిరాట్‌కు ప్రత్యేక అభిషేకాలు చేపట్టారు. అమ్మవారికి పట్టు పీతాంబరాలు, విశేష స్వర్ణాభరణాలు, సుగంధ పరిమళభరిత పుష్పమాలికలతో సుందరంగా అలంకరించి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. అనంతరం అర్చకులు శివ, సాయి వేదమంత్రాల నడుమ శాస్త్రోక్తంగా శాంతిహోమం నిర్వహించారు. సాయంత్రం కన్యకా పరమేశ్వరిదేవిని విశేషంగా అలంకరించి, మేళతాళాల మధ్య గ్రామంలో ఊరేగించారు. ఈ సందర్భంగా ఇంటింటా అమ్మవారికి నారికేళ, కర్పూర హారతులు ఇచ్చి మొక్కులు తీర్చుకున్నారు. ఆలయంలో భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

ఖరీఫ్ సాగులో బిజీబిజీ


ఏలుకూరిపల్లెలో వరి నాట్లు వేస్తున్న మహిళలు

పాలసముద్రం: మండల పరిధిలోని రైతన్నలు ఖరీఫ్ సాగుపై దృష్టి సారించారు. గత రెండు రోజులుగా వరి సాగు కోసం పొలాల్లో దుక్కులు చేస్తున్నారు. మండలంలో బోరు, బావుల కింద ఉన్న రైతులు ఖరీఫ్ సీజన్‌లో సుమారు 950 హెక్టార్లలో వరి పంట, మరి కొంతమంది 550 హెక్టార్ల వరకు శ్రీవరి సాగు, డ్రమ్‌సీడర్ పద్ధతిలో పంట సాగు చేస్తున్నారు. వరి సాగు చేస్తున్న రైతన్నలు ఎక్కువగా రసాయన ఎరువులు, పురుగు మందులను వాడడం వల్ల భూములు మొద్దుబారి పోయి దిగుబడి తగ్గిపోతుందని వ్యవసాయ అధికారులు చెబుతున్నారు. స్థానికంగా లభించే ఆకులతో జీవామృతం, ఘనజీవామృతం తయారు చేసుకుని పంటలకు వేస్తే దిగుబడి పొందవచ్చని సూచిస్తున్నారు.


వరి సాగుకు దుక్కులు చేస్తున్న రైతు

వైభవంగా ముత్యాలమ్మ దంపతుల ఊరేగింపు



కీళపూడిలో ఊరేగుతున్న ముత్యాలమ్మ, ముత్యాలయ్య, ఆలయం వద్ద పొంగళ్లు పెడుతున్న మహిళలు

- నేడు అగ్నిగుండం ప్రవేశం

పిచ్చాటూరు: మండలంలోని కీళపూడిలో ముత్యాలయ్య, ముత్యాలమ్మ స్వామి, అమ్మవారి ఊరేగింపు శనివారం వైభవంగా సాగింది. గ్రామంలో ముత్యాలమ్మ కొలుపులో భాగంగా శనివారం ఆలయంలో ప్రత్యేక అభిషేక పూజలు నిర్వహించారు. సాయంత్రం గ్రామ మహిళలు ఆలయ ప్రాంగణంలో పొంగళ్లు పెట్టి స్వామి, అమ్మవార్లకు నైవేద్యం సమర్పించారు. అనంతరం ముత్యాలయ్య, ముత్యాలమ్మ ఉత్సవమూర్తులను ప్రత్యేకంగా అలంకరించి ట్రాక్టర్‌పై పురవీధుల్లో ఊరేగించారు. డప్పులమోత, మంగళ వాయిద్యాలు, బాణసంచా మోతల నడుమ ఊరేగింపు సాగింది. స్వామి, అమ్మవార్లకు కర్పూర హారతులు, కొబ్బరి కాయలు కొట్టి ప్రజలు స్వాగతం పలికారు. పిండివంటలను నైవేద్యంగా సమర్పించారు. ముత్యాలమ్మ కొలుపును పురస్కరించుకుని ఆలయ ప్రాంగణం, గ్రామంలో ఏర్పాటు చేసిన విద్యుద్దీపాలంకరణ అందరినీ ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా ఆలయ ధర్మకర్త పాలు పద్మనాభం మాట్లాడుతూ ఆదివారం సాయంత్రం భక్తులు అగ్నిగుండ ప్రవేశం ఉంటుందన్నారు. ఇందుకు అవసరమైన ఏర్పాట్లు శరవేగంగా జరుగుతున్నట్లు ఆయన వెల్లడించారు.

నాడు–నేడు పనులు పూర్తి చేయండి


మాట్లాడుతున్న ఎంఈఓ మనోజ్‌కుమార్

కార్వేటినగరం: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న నాడు–నేడు పనులను వేగవంతంగా పూర్తి చేయాలని ఎంఈఓ ఎం.విజయకుమార్ అన్నారు. శనివారం ఎమ్మార్సీలో రెండో విడతలో మంజూరైన హెచ్‌ఎంలతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఎంఈఓ మాట్లాడారు. పాఠశాలలు పునఃప్రారంభానికి ముందే జరుగుతున్న నాడు–నేడు పనులను పూర్తి చేయాలని సూచించారు. విద్యార్థులకు రన్నింగ్ వాటర్‌తో కూడిన మరుగు దొడ్లు, డెస్కులు పాఠశాల ప్రారంభం నాటికి సిద్ధంగా ఉండేలా చూడాలన్నారు. అలాగే ప్రతి పాఠశాలకు విద్యుత్ సౌకర్యం ఉండాలని సూచించారు. పెండింగ్‌లో ఉన్న పనులను వెంటనే పూర్తి చేయాల్సిన బాధ్యత ఆయా స్కూళ్ల హెచ్‌ఎంలపై ఉందన్నారు. నిర్లక్ష్యం లేకుండా పూర్తి చేసి నివేదికను అందించాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఎంఈఓ–2 మనోజ్‌కుమార్, ఎస్‌ఎస్‌ఏ ఏఈ నాగభూషభూషణం, హెచ్‌ఎంలు పలువురు పాల్గొన్నారు.

తాగునీటి బోరు స్టార్టర్ చోరీ


పోలీసులకు ఫిర్యాదు చేస్తున్న గ్రామ సర్పంచ్, పంచాయతీ కార్యదర్శి

శ్రీరంగరాజపురం: రక్షిత మంచినీటి సరఫరా స్కీం ద్వారా ఏర్పాటు చేసిన బోర్ మోటార్ స్టార్టర్ చోరీకి గురైన సంఘటన మండలంలో చోటుచేసుకుంది. వివరాలు.. మండలంలోని ముద్దికుప్పం గ్రామ పంచాయతీ దిగువ ముద్దికుప్పం గ్రామ ప్రజలకు ప్రభుత్వ నిధులతో తాగునీటి కోసం ఏర్పాటుచేసిన బోరు మోటారు స్టార్టర్‌ను శుక్రవారం రాత్రి గుర్తు తెలియని దుండగులు చోరీ చేశారు. ఇటీవల వరుసగా చోరీలు జరుగుతున్నాయని, గతంలో చొక్కామడుగు గ్రామంలో స్టార్టర్ చోరీకి గురైనట్లు స్థానిక సర్పంచ్ గిరిబాబు శీనయ్య, ఎంపీటీసీ సిద్ధయ్య పంచాయతీ సెక్రటరీ కోదండరామిరెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. స్టార్టర్ సుమారు రూ.10,500 విలువ చేస్తుందన్నారు. సర్పంచ్, ఎంపీటీసీ, గ్రామస్తులతో కలిసి సెక్రటరీ కోదండరామిరెడ్డి స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఎస్‌ఐ రాజాకుళ్లాయ్యప్పకు ఫిర్యాదు చేశారు. దీనిపై ఎస్‌ఐ మాట్లాడుతూ స్టార్టర్ చోరీపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తామని తెలిపారు.

శరవేగంగా ఆలయ నిర్మాణ పనులు


ఆలయ నిర్మాణ పనులను పరిశీలిస్తున్న స్థానిక సర్పంచ్, నాయకులు

వెదురుకుప్పం: మండలంలోని సీఆర్‌కండ్రిగ ఎస్సీ కాలనీలో వరసిద్ధి వినాయక స్వామి ఆలయ నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. గ్రామస్తుల కోరిక మేరకు దేవదాయ శాఖ ఆలయ నిర్మాణానికి రూ.10 లక్షలు మంజూరు చేసింది. దీంతో అధికారులు ఆలయ నిర్మాణ పనులను చేపట్టింది. ఇప్పటికే 70 శాతం పనులు చేపట్టినట్లు కాంట్రాక్టర్ రామయ్య తెలిపారు. శనివారం స్థానిక నాయకులు ఆలయ నిర్మాణ పనులను పరిశీలించారు. అనంతరం వారు మాట్లాడుతూ వరసిద్ధి వినాయకుడి ఆలయ నిర్మాణ పనులను త్వరలో పనులను పూర్తి చేసి కుంభాభిషేక మహోత్సవాన్ని వైభవంగా నిర్వహిస్తామని చెప్పారు. అలాగే ఆలయం పక్కనే భక్తుల సౌకర్యార్థం కల్యాణ మండపం నిర్మించేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జాండ్లపేట సర్పంచ్ శేఖర్ రెడ్డి, స్థానిక నాయకులు పురంధర్ రెడ్డి, విక్కీ పాల్గొన్నారు.

శీతలాంబ అమ్మవారికి ప్రత్యేక పూజలు

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని పల్లమాల గ్రామంలోని శీతలాంబ దేవతకు శనివారం ప్రత్యేక పూజలు చేశారు. ముందుగా అమ్మవారి విగ్రహాన్ని పూలతో అలంకరించారు. గ్రామస్తులు పొంగళ్లు పెట్టి మొక్కులు తీర్చుకున్నారు. భక్తి శ్రద్ధలతో ప్రత్యేక పూజలు చేపట్టి ప్రసాదాలను పంపిణీ చేశారు.